క్లుప్తంగా

వైభవంగా యల్లమ్మ జాతర



సిరిమాను అధిరోహించిన పూజారి సత్యం

బొండపల్లి: మండల కేంద్రంలో యల్లమ్మ తల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బీవీ ప్రభుజీ, మాజీ ఎంపీపీ బండారు బంగారం, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన సిరిమానోత్సవంలో పూజారి బొట్ట సత్యం సిరిమాను అధిరోహించారు.

నేడు పల్లిగండ్రేడులో..

గుర్ల: మండలంలోని పల్లిగండ్రేడులో యల్లారమ్మ జాతరను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు, సర్పంచ్ శంకరయ్య సోమవారం మాట్లాడుతూ, మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం నాలుగు గంటలకు సిరిమానోత్సవం నిర్వహిస్తామన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి వెండి కిరీటం అలంకరిస్తున్న ఉపసర్పంచ్ శ్రీదేవి

చీపురుపల్లి: చీపురుపల్లి గ్రామదేవత అసిరితల్లి అమ్మవారికి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి వెండి కిరీటం బహూకరించారు. రూ.18 వేలతో పావు కిలో వెండి కిరీటాన్ని చేయించారు. ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారికి వెండి కిరీటాన్ని ఉపసర్పంచ్ శ్రీదేవి అలంకరించారు.కార్యక్రమంలో జిల్లా టెలీకాం బోర్డు సభ్యులు ఇప్పిలి తిరుమల, మీసాల రామారావు, వంకల కృష్ణ, అప్పికొండ రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం



నిర్వాహకులకు నగదు అందజేస్తున్న ఉదయ్‌రాజ్, హనీష

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి పట్టణానికి చెందిన సిటీ కేబుల్ యజమాని ఎస్.రాధాకృష్ణ అల్లుడు పి.ఉదయ్ రాజ్, కుమార్తె హనీష దంపతులు రూ. పది వేల ఆర్థికసాయం చేశారు. పట్టణంలోని వారి నివాసంలో క్లబ్ జోనల్ చైర్మన్ ఎస్. సన్యాసిరావు, కె.వెంకటేష్‌లకు నగదు అందజేశారు.

పరామర్శ



బుల్లిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని వింధ్యవాసి సర్పంచ్ రంభ చంద్రశేఖర్ తండ్రి, మాజీ సర్పంచ్ బుల్లిబాబు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన నివాసానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సోమవారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా యల్లారమ్మ సిరిమానోత్సవం



సిరిమానోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంట్యాడ: యల్లారమ్మ పండగ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శతకం పుట్ట నుంచి ఆలయం వరకు మూడు సార్లు సిరిమాను తిరిగింది. ఉదయాన్నే అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జన జాతర



జామి: యల్లారమ్మ జాతరలో జనసందడి



చీపురుపల్లి: సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన భక్తులు



చీపురుపల్లి: అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో సందడిగా ఉన్న ఆలయ ప్రాంగణం



జామి: ఆదివారం రాత్రి అమ్మవారిని గద్దె నుంచి ఆలయానికి తీసుకెళుతున్న దృశ్యం



జామి: యల్లారమ్మ దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు



జామి: జాతరలో వైద్య శిబిరం



జామి: అమ్మవారికి మొక్కలు చెల్లించుకుంటున్న భక్తులు



చీపురుపల్లి: కనకమహాలక్ష్మిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

చీపురుపల్లి కనకమహాలక్ష్మి, జామి యల్లారమ్మ జాతర్లు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతర్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజుతో పాటు రెండోరోజు సోమవారం కూడా వేకువ జాము నుంచే అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు దర్శించుకున్నారు. భక్తులతో చీపురుపల్లి, జామి జనసంద్రంగా మారాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– చీపురుపల్లి/ జామి



చీపురుపల్లి: రేలారేరేలా కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న పల్సర్ బైక్ రమణ

చెడు వ్యసనాలకు దూరం



మహిళా పోలీస్‌లతో ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ ఫర్హీన్, సీఐ విజయలక్ష్మి, తదితరులు

• అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హీన్

గజపతినగరం: యువతీ యువకులు గంజాయి, మత్తుపానీయాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏఎస్పీ అస్మ ఫర్హీన్ సూచించారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాలకు చెందిన మహిళా పోలీస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఈబీ సీఐ ఎం.విజయలక్ష్మి, ఎస్సై పి.అప్పారావు, ఎస్‌ఈబీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

గుర్ల: మండలంలోని గొర్లె జగన్నాథపురంలో సర్వే నంబర్ 1–1లో చెరువుకు వరదనీరు వెళ్లే కాలువను గూడేం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకు న్నట్లు తహసీల్దార్ పద్మావతికి స్థానిక రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి కాలువను ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపడుతున్నాడని, ఈ నిర్మాణాలను అడ్డుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గజపతినగరం: వేసవి సమీపించడంతో గజపతినగరంతో పాటు మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానిబాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామాలను సందర్శిస్తూ, తాగునీటి సరఫరాపై ఆరా తీస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్తంగా...

విభిన్న ప్రతిభావంతులకు అమ్మవారి దర్శనం



ఆలయం వద్ద విభిన్న ప్రతిభావంత విద్యార్థులతో ఎస్ఐ సన్యాసినాయుడు

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలో భాగంగా గరివిడిలోని అంధ, చెవిటి, మూగ పాఠశాలలో చదువుకుంటున్న విభిన్న ప్రతిభావంత విద్యార్థులు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. 80 మంది విద్యార్థులను ఎస్ఐ ఆలయంలోకి తీసుకెళ్లి దర్శనం చేయించి ప్రసాదం ఇప్పించారు. వారికి బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు.

సిర్లి పోతన్నకు పూజలు

చీపురుపల్లిరూరల్: పట్టణంలోని కస్పావీధి సిర్లిపోతన్న ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిర్లిపోతన్నను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

భూ రీ సర్వేకు సహకరించాలి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ తాడ్డి గోవింద్ అన్నారు. గరివిడి మండలంలోని ఆర్తమూరు పంచాయతీలో భూ రీసర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో సర్పంచ్ పొన్నాడ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. సర్వే జరిగినప్పుడు రైతులు అందుబాటులో ఉండాలని సూచించారు. సర్వేయర్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యుడు పతివాడ గురునాయుడు, వైస్ సర్పంచ్ జి.చిన్నపైడితల్లి, మాజీ సర్పంచ్ మహంతి రమణమూర్తి పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోండి

గజపతినగరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పప్పు సుదర్శనం పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని 99వ పోలింగ్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ సహకారం తీసుకుంటామన్నారు. అనంతరం బాలుర హైస్కూల్‌ను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇ వీఆర్‌ఓ తిరుపతిరావు, పంచాయతీ ఈఓ జనార్దనరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ గాంధీ పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి

వేపాడ: మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులపై నిర్వహించనున్న సోషల్ ఆడిట్‌కు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వేతనదారులు సహకరించాలని ఎంపీడీఓ పట్నాయక్ కోరారు. మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సామాజిక బృందాలు నిర్వహించే ఆడిట్‌కు పూర్తి సహకారం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎస్ఆర్పీ చిరంజీవి మాట్లాడుతూ మంగళవారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఆడిట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీఓ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలో ఉపాధి హామీ పనులపై సోషల్‌ఆడిట్‌కి సిద్ధం కావాలని ఎస్ఆర్పీ సీహెచ్.అప్పారావు ఉపాధి హామీ ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనులకు సంబంధించి పూర్తిస్థాయిలో రికార్డులు సిద్ధం చేసుకోవాలని, ఆడిట్ బృందం అడిగే ప్రశ్నలకు తగిన విధంగా వివరణ ఇవ్వాలని సూచించారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి, కొట్యాడ, ఖాసాపేట సెగ్మెంట్లలో ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఉప ఎన్నికలు నిర్వహిం చేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా సెగ్మెంట్ల పరిధిలోని కళ్లేపల్లి, తామరాపల్లి, ఖాసాపేట,తలారి,కొట్యాడ పంచాయతీ కార్యాలయాల వద్ద ఓటర్ల జాబితాను సోమవారం ప్రదర్శించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

వేపాడ: సోంపురం గ్రామ సచివాలయాన్ని ఈఓపీఆర్డీ సూర్యనారాయణ సోమవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో ఇంటి పన్ను వసూళ్లపై సిబ్బంది నిఆరా తీశారు. అనంతరం జగ్గయ్యపేట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో స్పందన

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటలకు మండలంలో ఉండే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బూర్లిపేటలో జ్వరాలు

గుర్ల: మండలంలోని బూర్లిపేటలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో సుమారు 40 మంది జ్వరాలతో బాధపడుతున్నారు.పారిశుద్ధ్య నిర్వహణా లోపం, కలుషిత నీరు వల్లే జ్వరాలు భారిన పడుతున్నారని గ్రామస్తులు పలువురు చెబుతున్నారు. తెట్టంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు.

క్వారీ కార్మికుల నిరసన

శృంగవరపుకోట: తమకు రోజువారీ వేతనం పెంచాలని కోరుతూ స్టోన్ క్రషర్లు, క్వారీల కార్మికులు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ముందుగా కార్మికులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈసందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ జనవరిలో వేతన ఒప్పందం ముగిసిందని, కొత్త వేతన ఒప్పందం చేయాలని ఎన్ని దఫాలు అడిగినా క్వారీల యాజమాన్యాలు అంగీకరించకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందన్నారు. పాత వేతనాలపై రూ.4వేలు పెంచాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తదితర డిమాండ్లు చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్.ముత్యాలు, క్వారీ కార్మికుల యూనియన్ నాయకులు యల్లా ప్రగడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మరుపల్లిలో పారిశుద్ధ్య పనులు

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. అన్ని వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై, తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై ప్రజలకు మైక్‌ద్వారా అవగాహన కల్పించారు. చెత్తను కాలువల్లో, ఆరుబయట పారబోయకుండా గ్రీన్‌అంబాసిడర్‌కు అందించాలని సూచించారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

• గృహసారథులకు ఎమ్మెల్యే అప్పలనరసయ్య సూచన

దత్తిరాజేరు: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని, ఎల్లోమీడియా తప్పుడు కథనాలను ప్రజలకు వివరించాలని, వారి కుట్రలు, కుతంత్రాలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని గృహసారథులకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయు డు, మండల సచివాలయాల కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు అధ్యక్షతన పెదమానాపురంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి నివాసం వద్ద గృహసారథుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని, గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.అనంతరం వి.కృష్ణాపురం, వింధ్యవాసి, వంగర, దత్తిరాజేరు, గొభ్యాం, పెదకాద గ్రామాల్లో గృహసారథులకు 'మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం మెటీరియల్‌ను అందజేశారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పెదమానాపురం, వి.కృష్ణాపు రం, వింధ్యవాసి, వంగర, దత్తిరాజేరు, గొభ్యాం, పెదకాద గ్రామాల్లో పట్టభద్రులను ఎమ్మెల్యే కోరారు. సర్పంచ్‌లు గొటివాడ దాసు, పొడుపురెడ్డి సత్యం, మార్పిన ఎర్రయ్యమ్మ, రంభ చంద్రశేఖర్, డి.ఎస్.ఎ.నాయుడు(చినబాబు)వంగపండు లక్ష్మునాయుడు, డోల చంద్రమ్మ, గుజ్జ మంగ, ఎంపీటీసీలు గొటివాడ కన్నయ్య, మంత్రి అప్పలనాయుడు, నాగిరెడ్డి సత్యం, టెలికాం అడ్వయిజరీ బోర్డ్ మెంబర్ దత్తి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కొత్తవలస : పట్టభద్రుల ఓటర్ల జాబితాను నాయకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ప్రచారం నిర్వహిస్తున్న గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ రమణ, నాయకులు

కొత్తవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో తన క్యాంపు ఆఫీస్‌లో నియోజకవర్గంలోని మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని, ఉపాధి కల్పనకు చేపడుతున్న చర్యలను పట్టభద్రులకు వివరించాలన్నారు. విశాఖపట్నంలో రాజధాని ఏర్పాటుకు ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నట్లు గుర్తు చేయాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాల పార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, జగ్గుబాబు, వేపాడ జెడ్పీటీసీ సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపించండి

బొండపల్లి: మార్చి 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ కోరారు. గొట్లాంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సీతంరాజును గెలిపించి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు తెలియజేయాలన్నారు. సుధాకర్ ఇప్పటికే రాష్ట్ర బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని, అటువంటి మేధావులను చట్టసభలకు పంపించాలని సూచించారు. ప్రచారంలో మీసాల సరోజిని, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల తులసీరాం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మండల రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల ప్రతిష్ఠోత్సవాలు



శృంగవరపుకోట: సీతారాంపురంలోని విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. మార్చి 3వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 3వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం ఉంటుందని, భక్తులు హాజరు కావాలని కోరారు.

కొత్తవలసలో..

కొత్తవలస: మండల కేంద్రంలోని గిరిజాల రోడ్డు కుమ్మరిబంజరి సమీపంలోని గరుడాద్రి కొండపై కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయప్రతిష్ఠోత్సవాలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. ఆలయంలో ప్రతిష్ఠించనున్న లక్ష్మీదేవి, గోదాదేవి అమ్మవార్లు, వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బోని వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ నాగభూషణరావు

గంట్యాడ: అపరాల కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) నాగభూషణరావు సూచించారు. మండలంలోని వసాది గ్రామంలో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మినుములు క్వింటాల్ రూ. 6,600, పెసలు రూ. 7,755 చొప్పున మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. అపరాల్లో మట్టి, బొత్తు, చిరు గింజలు లేకుండా శుభ్రం చేసి కేంద్రాల వద్దకు తీసుకురావాలని రైతులకు సూచించారు. మార్క్‌ఫెడ్ డీఎం విమల, ఏఓ శ్యామ్‌కుమార్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘననివాళులు



చంద్రశేఖర్ జీవిత చరిత్రను వివరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్

శృంగవరపుకోట: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం అధ్యాపకులు చల్ల శ్రీనివాసరావు నేతృత్వంలో సోమవారం నిర్వహించారు. చంద్రశేఖర్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నవయస్సులోనే స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను వివరించారు. దేశం కోసం ఆయన తృణప్రాయంగా ప్రాణం వదిలారని గుర్తు చేశారు. హిస్టరీ లెక్చరర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'సఖి'పై అవగాహన కల్పించండి



అధికారులు, వైద్య సిబ్బందితో సమావేశమైన ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: సఖి గ్రూపుల విధి విధానాలు, వాటి ఆవశ్యకతపై బాలికలు, మహిళలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ మండలంలోని పలుశాఖల అధికారులు, పీహెచ్‌ల వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9–21 ఏళ్ల లోపు బాలికలు, మహిళలతో సఖి గ్రూపులు ఏర్పాటు చేయించాలని సూచించారు. చదువుతోపాటు ఉద్యోగ,ఉపాధి అంశాలు, బాల్యవివాహాల నిర్మూలన, దిశ తదితర చట్టాలు, పౌష్టికాహారం, ఆరోగ్యంపై సఖి గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పీఆర్ ఏఈ ఆలీ, ఏపీఓ శ్రీనివాసరావు, ఏపీఎం సన్యాసినాయుడు, వేపాడ, బొద్దాం పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.